ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 7 ఏప్రిల్ 2024

ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలి

● రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎం.కె.మీనా


మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 6: ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో జారీ కానున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. శనివారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు ఎవరు పాటించకపోయినా సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ.. ఫారం - 6, 7, 8కి సంబంధించిన వివరాలను, రోజువారీ ఎంసీసీ నివేదికలను పంపిస్తున్నట్లు తెలిపారు. అలాగే సీజర్ బృందాల ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులపై సత్వర చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సీ-విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

● ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ.. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు తనిఖీల్లో పట్టుబడిన నగదు, బంగారం తదితర వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఎటువంటి రాజకీయ హింస లేదని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎం.భరత్‌నాయక్, సీహెచ్.రంగయ్య, ఏఎస్పీ ప్రేమ్ కాజల్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సిక్కోలులో సెగలు

● దంచి కొడుతున్న ఎండలు
● అల్లాడుతున్న జనం


శనివారం మధ్యాహ్నం శ్రీకాకుళం పొట్టిశ్రీరాములు జంక్షన్‌లో జన సంచారం లేని దృశ్యం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సిక్కోలు సెగలు గక్కుతోంది. గత మూడు రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. దీనికి తోడు తీవ్ర వడగాల్పులతో ప్రజలు అల్లాడుతున్నారు. శనివారం పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆమదాలవలసలో 41.6, బూర్జ 40.8, జి.సిగడాం 42.5, హిరమండలం 40.9, జలుమూరు 41.6, కంచిలి 40.0, కోటబొమ్మాళి 41.6, ఎల్ఎన్ పేట 40.0, మెళియాపుట్టి 43.0, నందిగాం 39.3, నరసన్నపేట 41.6, పలాస 40.3, పాతపట్టణం 42.3, పోలాకి 40.0, సారవకోట 42.7, సరబుజ్జిలి 40.6, శ్రీకాకుళంలో 40.1 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలకు జనాలు లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. శ్రీకాకుళం నగరంలో ఎప్పుడూ రద్దీగా ఉండే పొట్టిశ్రీరాముల జంక్షన్, ఏడురోడ్ల జంక్షన్, జీటీ రోడ్లు.. మధ్యాహ్నం కర్ఫ్యూని తలపించాయి. వడగాల్పులకు భయపడి ఎక్కువ మంది సాయంత్రం వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఐస్‌క్రీమ్, లస్సీ, కొబ్బరి నీళ్లు, తదితర పానీయాలు తాగారు.


ఎండ వేడిని తట్టుకోలేక శీతల పానీయాలు తాగుతున్న మహిళలు

అమ్మో ఎలుగుబంటి


మఖరజోల వద్ద జీడితోటల్లో సంచరిస్తున్న ఎలుగుబంటి

హరిపురం, ఏప్రిల్ 6: ఉద్దాన ప్రాంతానికి పరిమితమైన ఎలుగు బంట్లు ఇప్పుడు మైదానప్రాంతంలో హల్‌చల్ చేస్తున్నాయి. గత ఐదురోజులుగా మందస మండలంలోని మఖరజోల, వాసుదేవపురం, నవరమధ్య, కొర్రాయిగేటు గ్రామాల్లో ఓ ఎలుగుబంటి సంచరిస్తోంది. పగలంతా జీడితోటల్లో మకాం వేసి సాయంత్రం ఆరు దాటాక గ్రామాల్లోకి వచ్చేస్తుంది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. జీడితోటల్లో పిక్కలు సేకరించేందకు వెళ్లిన మఖరజోలకు చెందిన రైతులపై శనివారం సాయంత్రం దాడికి ప్రయత్నించింది. త్రుటిలో వారు తప్పించుకున్నారు. రాత్రుళ్లు జాతీయరహదారిపై భల్లూకం స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు హడలిపోతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి ఎలుగుల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

టెక్కలిలో శంఖారావయాత్ర

టెక్కలి, ఏప్రిల్ 6: టీడీపీ శంఖారావ యాత్రను శనివారం టెక్కలిలో నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు ప్రారంభమైన ఈ యాత్రను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు తనయుడు కృష్ణమోహన్‌నాయుడు ప్రారంభించారు. కిల్లిపోలమ్మ గుడి నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు కిలోమీటరు మేర ర్యాలీ జరిగింది. రామ్మోహన్‌పై ప్రజలు పూలు జల్లుతూ నీరాజనం పలికారు.


రామ్మోహన్‌నాయుడును గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

నీడ నీరూ లేదు

● ఉపాధి పని ప్రదేశాల్లో కానరాని సౌకర్యాలు
● మండుటెండలోనే పనులు చేస్తున్న వేతనదారులు
● వడదెబ్బకు గురై మృత్యువాత పడుతున్న వైనం


మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురంలో ఎండలోనే పనులు చేస్తున్న వేతనదారులు

(మెళియాపుట్టి)

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఎండలకు తోడు వడగాడ్పులు వీస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంతటి ఎండలోనే ఉపాధి హామీ పథకం వేతనదారులు పనులు చేస్తున్నారు. పనులు చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నీడ కోసం టెంట్లు, తదితర ఏర్పాట్లు చేయకపోవడంతో ఎర్రటి ఎండలోనే వేతనదారులు పనులు చేస్తున్నారు. దీంతో వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రస్తుతం 1,78,568 మంది వేతన దారులు మాత్రమే పనులకు వెళ్తున్నారు. కొంతమంది ఎండలకు భయపడి గత మూడు రోజులు నుంచి పనులకు దూరంగా ఉంటున్నారు. ఉపాధి పనులు చేసే చోట వేతనదారులు ప్రమాదాలకు గురైతే ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. పని ప్రదేశంలో నీడను ఏర్పాటు చేసుకోవడానికి గతంలో టార్పాలిన్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ఉపాధి పనుల చోట కనీస సౌకర్యాలు లేవని వేతనదారులు వాపోతున్నారు. టార్పాలిన్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీరు, మజ్జిగ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొంతమంది కర్రలతో పందిరి వేసుకొని అందులో సేదతీరుతున్నారు. పని ప్రదేశంలో నీరు సైతం అందుబాటులో ఉంచడం లేదు. దీంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మజ్జిగను అందజేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అటువంటి సౌకర్యాలు ఏమీ లేవని వేతన దారులు చెబుతున్నారు. కాగా, కొంతమంది పనులకు వెళ్లకపోయినా మస్తర్లు వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి రోజూ పరిశీలన చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కొంతమంది మేట్లతో ఫీల్డ్‌అసిస్టెంట్లు తప్పుడు మస్తర్లు వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు తప్పుడు మస్తర్లపై చర్యలు తీసుకోవాలని వేతనదారులు కోరుతున్నారు.



● ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామంలో ఈ నెల 3న ఉపాధి పనులకు వెళ్లిన గరుగుబెల్లి రాజులమ్మ వడదెబ్బకు గురై మృతి చెందింది. గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న సత్తిబంద చెరువు వద్ద ఉపాధి పనులకు వెళ్లిన రాజులమ్మ కొద్ది సేపటికే వడదెబ్బకు గురై కుప్పకూలిపోయింది.

● గత ఏడాది ఉపాధి పనులకు వెళ్లి సుమారు 15 మంది వరకు వడదెబ్బతో మృత్యువాత పడినట్లు లెక్కలు ఉన్నాయి. వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందలేదు. దీంతో ఉపాధి వేతనదారులు ఆందోళన చెందుతున్నారు.

పనివేళలు మార్పు చేశాం

ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున ఉపాధి పని వేళల్లో మార్పులు చేశాం. ప్రతిరోజూ ఉదయం 6.30 గంటల నుంచి 10.30 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేయాలి. తాగునీటి కోసం వేతనాల్లో జమచేస్తాం. నీడను ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నాం.

-ఆదినారాయణరెడ్డి, ఈసీ, మెళియాపుట్టి

ఉపాధి కూలీల వేతనం రూ.300కు పెంపు

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 6: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఈ వేసవి నుంచి వేతనం రూ.300కు కేంద్ర ప్రభుత్వం పెంచిందని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో తాగునీటి ఎద్దడి, ఉపాధి హామీ పనులు, విద్యుత్తు సరఫరా తదితర అంశాలపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సోమవారం నుంచి జిల్లాలో 1.82 లక్షల మంది ఉపాధి పనులకు హాజరవుతారని చెప్పారు. ఈ పనులను ఎంపీడీవోలు, ఉపాధి పీడీలు పర్యవేక్షించాలన్నారు. వేతనదారులకు తాగునీరు అందించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో బోర్లు మరమ్మతులకు గురైతే 24 గంటల్లోగా బాగు చేయాలన్నారు. సీపీడబ్ల్యుఎస్ స్కీమ్‌లన్నీ సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి, డీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ చిట్టిరాజు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ జీజే బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే

● నిలిచిన రాజాం కాలనీ-వజ్రపుకొత్తూరు రోడ్డు విస్తరణ
● ఆగిన ఫిష్ ల్యాండ్ నిర్మాణం
● అప్రోచ్ రోడ్డుదీ అదే పరిస్థితి
● జీవోలకే పరిమితమైన మరికొన్ని పనులు
● ప్రజలకు తప్పని ఇబ్బందులు

(వజ్రపుకొత్తూరు)

వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు పడకేశాయి. నిధుల సమస్యతో వజ్రపుకొత్తూరు మండలంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క పని కూడా పూర్తి కాలేదు. రాజాంకాలనీ-వజ్రపుకొత్తూరు రోడ్డు విస్తరణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. నువ్వలరేవు ఉప్పటేరు అప్రోచ్ రోడ్డుకు అతీగతి లేదు. ఫిష్‌ల్యాండ్ నిర్మాణాన్ని గాలికొదిలేశారు. నువ్వలరేవు- బెండిగేటు జంక్షన్ రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు. ఇలా పనులన్నీ మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధులు విడుదల కాకపోతే తామేమి చేస్తామంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు.


అక్కుపల్లి రోడ్డు పనులు నిలిచిపోవడంతో రాళ్లు తేలిన దృశ్యం

భూమిపూజతో సరి..

నువ్వలరేవు గ్రామ సమీపంలో ఫిష్‌ల్యాండ్ నిర్మాణానికి వైసీపీ నాయకులు అట్టహాసంగా భూమి పూజ చేశారు. దీనికి నువ్వలరేవు- మంచినీళ్లపేట ఫిష్‌ల్యాండ్ అంటూ నామకరణం కూడా చేశారు. అయితే, నిధుల సమస్యతో పనులు ముందుకు సాగలేదు. తరువాత దీన్ని జట్టీగా మారుస్తున్నట్లు పలు వేదికలపై వైసీపీ నాయకులు ప్రకటనలు గుప్పించారు. ఇప్పటికీ ఈ పనులు 20 శాతం కూడా జరగలేదు. పనులు పూర్తయితే తీరప్రాంత మత్స్యకారులకు ఎంతో మేలు జరిగేది.


నువ్వలరేవు వద్ద నిలిచిన జట్టీ నిర్మాణం

పూర్తికాని రహదారి విస్తరణ

రాజాంకాలనీ నుంచి వజ్రపుకొత్తూరు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును రెండు లైన్లగా విస్తరించడానికి మూడేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. తొలుత పనులు వేగవంతంగా జరిగినా తరువాత మందగించాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం ఈ పనులు నిలిచిపోయాయి. ధర్మపురం, గరుడుభద్ర, అక్కుపల్లి, భైపల్లి, బాతుపురం, చినవంక, డోకులపాడు గ్రామాల వద్ద రాళ్లు చేసి వదిలేశారు. తారుగానీ, గ్రావెల్ గానీ వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై రాళ్లు తేలడంతో ద్విచక్ర వాహనాలు బోల్తాపడి పలువురు గాయపడుతున్నారు. ఎన్నికల కోడ్ రావడంతో నిధులు విడుదలపై అయోమయం నెలకొంది. దీంతో ఈ రోడ్డు పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సగంలో ఆపేశారు..

నువ్వలరేవు నుంచి బెండి మీదుగా బెండిగేటు జంక్షన్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకగా సాగుతున్నాయి. బెండి వద్ద ఒకవైపు సిమెంట్ రోడ్డు నిర్మించి మిగిలిన సగం ఆపేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ● పూండి- బెండిగేటు రోడ్డు పనులు, బెండి ఎత్తిపోతల పనులు, ఒంకులూరు రాకాసి గెడ్డపై సుమారు రూ.5కోట్లతో వంతెన పనులు చేపట్టేందుకు జీవోలు విడుదలైనా పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు.

నువ్వలరేవు ఉప్పటేరుపై సుమారు రూ.40కోట్ల వ్యయంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెనకు అటు మంచినీళ్లపేట వైపు, ఇటు నువ్వలరేవు వైపు అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టే సమయంలో టీడీపీ ప్రభుత్వం మారిపోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అప్రోచ్ రోడ్డును పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు కోసం నువ్వలరేవు వైపు 105 ఇళ్లు తొలగించాల్సి ఉంది. అధికారులు సైతం ఇళ్లకు మార్కింగ్ వేశారు. బాధితులకు గ్రామ సమీపంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు

అప్రోచ్ రోడ్డు పనులు వదిలేశారు..

అధికారులు, నాయకులు సమావేశాలు ఏర్పాటు చేశారు. అయితే, ఈ స్థలం సీఆర్‌జెడ్ పరిధిలో ఉండడంతో బాధితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ముందుకు రాలేదు. మరోవైపు కేపీటీలు గ్రామానికి దూరంగా వెళ్లేందుకు ఆసక్తి చూపకపోవడంతో అప్రోచ్ రోడ్డు పనులు ముందుకు సాగలేదు. గ్రామానికి దూరంగా ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు నువ్వలరేవు గ్రామస్థులను ప్రభుత్వం ఒప్పించి ఉంటే ఈ సమస్య పరిష్కారమయ్యేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


ముందుకు సాగని ఉప్పటేరు వంతెన అప్రోచ్ రోడ్డు పనులు

చెరకు సాగు తగ్గుముఖం..

- ప్రభుత్వ ప్రోత్సాహం లేకనే
- గిట్టుబాటు ధర రాక రైతుల వెనుకంజ
- బెల్లం తయారీకి ఇబ్బందులే..

సుందరాడ గ్రామానికి చెందిన సవలాపురం భాస్కర రావు గతంలో పదెకరాల్లో చెరకు సాగు చేసేవారు. విపత్తుల సమయంలో చెరకు పంటకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో నష్టం బారినపడ్డారు. దీంతో ఈ ఏడాది ఎకరంలో మాత్రమే చెరకు పంట వేసి బెల్లం తయారు చేస్తున్నారు.

...మాకనాపల్లి గ్రామంలో రైతులందరూ సుమారు 150 ఎకరాల్లో చెరకు పంటను వేసేవారు. మూడేళ్ల నుంచి గిట్టుబాటు కాకపోవడంతో పూర్తిగా చెరకు సాగు మానేశారు.

(మెళియాపుట్టి)

ఉమ్మడి జిల్లాలో సుమారు 10 మండలాల్లో 15 వేల హెకార్లలో చెరకు పంట వేస్తున్నారు.అయితే సంబంధిత రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోవడంతో రైతులు వివిధ రూపాల్లో నష్టపోతున్నారు. దీంతో చెరకు సాగు తగ్గుతోంది. పూర్వం నుంచి చెరకు పంట సాగు చేస్తున్న రైతులు ఇటు సాగు వదులుకోలేక, అటు సాగుచేయలేక అవస్థలు పడుతున్నారు. చెరకు వల్ల కనీసం గిట్టుబాటు రాకపోవడంతో మరికొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. చెరకు సాగుతో పాటు గానుగలు ఎక్కువగా గతంలో కనిపించేవి. అయితే రాను రాను గానుగ ఆడడం కూడా రైతులు మానేస్తున్నారు. అక్కడక్కడ గానుగ చేస్తూ వచ్చిన మొత్తంతో జీవనం సాగిస్తున్నారు. గతంలో సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి చెరకును తరలించేవారు. ప్రస్తుతం ఆ పరిశ్రమ వారు కూడా మెళియా పుట్టి, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం మండలాల రైతుల నుంచి చెరకు తీసుకొనే పరిస్థితి



అంజనాపురం వద్ద గానుగకు ఏర్పాటు చేసిన ఆటో

లేదు. రవాణా చార్జీలు అధికం కావడంతో చెరకు సేకరణ నిలిపి వేశారని పలువురు రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గానుగ ఆడేందుకు ఎద్దులకు ప్రత్యామ్నాయంగా ఆటోలను వినియోగిస్తున్నారు.

గిట్టుబాటు ధరేదీ?

చెరకు సాగులో పెట్టుబడులు ఎక్కువవడం గిట్టుబాటు కాకపోవడంతో రైతులు నిరాసక్తత వ్యక్తంచేస్తున్నారు. చెరకు సాగు ప్రారంభం నుంచి

గొడ్డ గ్రామానికి చెందిన చందక దాలినాయుడు.. గతంలో సుమారు 5 ఎకరాల్లో చెరకు పంటవేసి గానుగ ద్వారా బెల్లం తయారు చేసి మంచి లాభాలు సాధించారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చెరకు రైతులకు ప్రోత్సాహకం లేకపోవడం, కూలీ రేట్లు పెరగడంతో ఈ ఏడాది రెండెకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నట్లు దాలినాయుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



బెల్లం పాకం తీస్తున్న రైతులు

పంట చేతికి అంది వచ్చే వరకు వివిధ దశల్లో కూలీల అవసరమవుతోంది. అయితే ప్రస్తుతం కూలీల ధరలు పెరగడంతో పాటు కూలీలు సైతం లభ్యం కావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. అలాగే చెరకు పంటను అడవిపందుల నుంచి కాపాడు కునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ఎకరానికి రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని, కిలో బెల్లం రూ.30 లకు రైతుల వద్ద కొనుగోలు చేసి మార్కెట్‌లో రూ.50, రూ.60 లకు అమ్ముతున్నారని, దీంతో రైతుకు లాభం చేకూరడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం సైతం బెల్లం కొనుగోలుకు ముందుకు రావడం లేదని దీంతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

దందాల వసూళ్లకే వైసీపీ నేతలు పరిమితం: ఎంపీ



ఎంపీ రామ్మోహన్ నాయుడు పాల్గొన్న ఉమ్మడి పార్టీల భారీ ర్యాలీ

టెక్కలి, ఏప్రిల్ 6: ఐదేళ్లలో టెక్కలి వైసీపీ నాయకులు కలెక్షన్లు, దందాలకు పాల్పడ్డారని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆరోపించారు. శనివారం రాత్రి టెక్కలిలో శంఖారావం యాత్ర నిర్వహించారు. టీడీపీ- జనసేన-బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారు లెవరైనా చందాలు ఇవ్వకపోతే వారిపై కేసులు పెడతామంటూ వైసీపీ నేతల అనుచరులు భయపెట్టడం పరిపాటిగా మారిందన్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణమవుతున్న పోర్టును వైసీపీ కార్యాలయంగా మార్చేశారని, వైసీపీ జెండాలు మొదలుకొని డబ్బులు పంపిణీ ప్రక్రియ అంతా అక్కడి నుంచే జరుగుతోందని విమర్శించారు. 40ఏళ్లలో కింజరాపు కుటుంబం ప్రజాసేవకే పరిమితమైందని, అదే వైసీపీ మాత్రం అందరికీ తెలిసినట్లు వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టిందన్నారు. మరో 37 రోజుల్లో రానున్న ఎన్నికల్లో సైకిల్ స్పీడ్‌కు ఫ్యాన్ ముక్కలవుతుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో అచ్చెన్నాయుడుకు 50వేల మెజార్టీ అందించాలని కోరారు. కళింగ వైశ్యులను బీసీలుగా చేర్చిన ఘనత టీడీపీ దేనని, ఈసారి వాకిరి ఓబీసీల్లో చేర్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, బీజేపీ ఇన్‌చార్జి అట్టాడ రవిబాబ్జీ, టీడీపీ నాయకులు బగాది శేషగిరి, పినకాన అజయ్ కుమార్, జీరు భీమారావు, చౌదరి బాబ్జీ, కోళ్ల లవకుమార్, కోళ్ల కామేసు, డొంకాన రామకృష్ణ, మామిడి రాము, మట్ట పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి: బగ్గు



పోలాకి:గుప్పెడుపేటలో ప్రచారం చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

జలుమూరు, (సారవకోట)/ పోలాకి: టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం సారవకోట మండలం మహసింగి, కొత్తూరు, పనసలోవ, పోలాకి మండలం గుప్పెడు పేట, కొవిరిపేట గ్రామాల్లో ఎన్ని కల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు జయహో బీసీ సదస్సు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులుగా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలి పించాలని కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దర్మాన తేజ్ కుమార్, రెండు మండలాల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, ఎంపీ అప్పలనాయుడు, నేతలు సాధు చిన్ని కృష్ణంనాయుడు, డి.జయరాం, పి.నందకిశోర్, రేణంకి కృష్ణంనాయుడు, బైరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో వెనుకబాటు: శిరీష



వృద్ధురాలితో మాట్లాడుతున్న గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు: గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుక బాటు ఏర్పడిందని ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. శనివారం మంచినీళ్లపేటలో ఎన్నికల ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజ లకు వివరించారు. మత్స్య కారుల చేపల నిషేధిత కాలంలో భృతి రాకుండా అడ్డుకున్న వైసీపీ నాయకులను తరమికొ ట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శశి భూషన్, దుర్యోధనరెడ్డి పాల్గొన్నారు.

● **పలాస:** ఎన్నికల్లో వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. శనివారం శివాజీ నగర్, అంబుసోలి, ప్రకాశరావునగర్ ప్రాంతాల్లో ఇంటింట ప్రచారం చేశారు. ఉమ్మడి టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషను గెలిపించాలని కోరారు. ఆ పార్టీ నాయకులు వజ్జ బాబూరావు, లొడ గల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** కొత్తపల్లిలో పూండి క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు ఆధ్వ ర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు నాయకులు గొరకల వసంతరావు, కర్ని రమణ, గోవిందు పాపారావు, కంబా దానేష్ పాల్గొన్నారు. ● **పలాసరూరల్:** రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. కమలా పురం, వీరభద్రాపురాల్లో శనివారం ప్రచారం చేశారు. టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, దువ్వాడ సంతోష్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ నేతల చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులకు కండువా కప్పుతున్న అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: గోవిందపురం పంచాయతీ ఎరకన్నపేట వైసీపీ నేతలు శనివారం టీడీపీలో చేరారు. పంచాయతీ 10వ వార్డు సభ్యుడు ఏదూరు ఆదినారాయణ, ఉప సర్పంచ్ ప్రతినిధి దాసరి రామకృష్ణ తదితరులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అచ్చెన్నాయుడు నాయకత్వంలో గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి రెడ్డి అప్పన్న, సువ్వారి ప్రసాద్, రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి నుంచి పలువురు..

టెక్కలి: మేజర్‌పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ ముఖ్య నాయకులు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. గొల్లవీధికి చెందిన సవర రామకృష్ణ, కొండ్రవీధికి చెందిన అద్దాల రాజేష్ లకు ఎంపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపునకు సహకరిం చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



వివరాలు సేకరిస్తున్న జోనల్ మలేరియా అధికారి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో వ్యాధులను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ సూచించారు. లక్ష్మీనర్సుపేట పీహెచ్‌సీని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ ఏడాది మలేరియా పాజిటివ్ కేసులు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరిం చాలన్నారు. ఆమెతోపాటు డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ శ్రీకాంత్, వైద్యాధికారి ప్రియాంక, సబ్ యూనిట్ అధికారులు ఆచారి, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

నాటుతుపాకీ లభ్యంపై దర్యాప్తు



దర్యాప్తు నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి, ఏప్రిల్ 6: నర్సింగపల్లి పంచాయతీ నౌపడా-మెళియాపుట్టి రోడ్డు సమీపంలో లంకపాడు జంక్షన్‌కు ఎదురుగా నర్సింగపల్లి గ్రామానికి చెందిన తాడేల నీలకంఠానికి చెందిన గడ్డివాములో ఈనెల 2న గుర్తుతెలియని వ్యక్తులు దాచిన నాటుతుపాకీని గుర్తించి నీలకంఠం కుమారుడు లక్ష్మణరావు పోలీసుల కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ ప్రాంతంతో పాటు గిరిజన గ్రామాల్లోని పలు ఇళ్లల్లో సోదాలు చేశారు. శనివారం ఆ ప్రాంతంలో తనిఖీ చేసి విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. ఈ మేరకు అన్‌క్లయిమ్డ్ ప్రాపర్టీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పైడయ్య తెలిపారు. అయితే ఈ ప్రాంతంలో వణ్యప్రాణులు వేట కోసం ఈ నాటు తుపాకీ ఎవరైనా దాచిపెట్టారా అన్న విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు.

అచ్చెన్న కుటుంబానికి అశోక్ గజపతిరాజు పరామర్శ



అచ్చెన్నను పరామర్శిస్తున్న అశోక్ గజపతిరాజు

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతి ఇటీవల మృతి చెందడంతో శనివారం నిమ్మాడలో కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు అచ్చెన్నను పరా మర్శించారు. అలాగే జడ్పీ మాజీ చైర్మన్ బగ్గు లక్ష్మణరావు, నరసన్నపేట, పాతపట్నం టీడీపీ అభ్యర్థులు బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, టీడీపీ సీనియర్ నాయకులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, చిరుమామిళ్లి సూర్య నారాయణ, కె.నరేంద్ర, కె.రాజచంద్రమౌళి, వల్లభనేని గిరిబాబు, జ్ఞానశేఖర్ తదితరులు పరామర్శించి సానుభూతి తెలిపారు.

రహ'దారుణా'లు



తోటాడ-గొల్లలవలస-డోల రోడ్డుపై చిప్స్ వేసి వదిలేసిన దృశ్యం

గొల్లలవలస (పోలాకి): మండలంలో పలు రహదారులు దారుణంగా ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇటీవల పలు రోడ్లకు శంకుస్థాపనలు చేసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గొల్లలవలస, తోటాడ, సంతలక్ష్మీపురం, డోల, దీర్ఘాశి, ఉరజాం గ్రామాల రహదారులు దారుణంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. తోటాడ గ్రామం నుంచి డోల గ్రామం వరకు బీటీ రహదారి నిర్మాణం కోసం 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా అప్పటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ఇటీవల నెలరోజుల కిందట ఎన్నికల సమీపిస్తాయని తెలిసి హడావుడిగా ఈ రోడ్డును బీటీ రహదారిగా మార్చేందుకు వైసీపీ ప్రజా ప్రతినిదులు మరలా శంకుస్థాపన చేశారు. భూమిపూజ చేసిన 22 రోజుల తర్వాత రహదారిపై ఉన్న రాళ్లను తొలగించి చిప్స్ వేశారు. 4 కి.మీల పొడవున పెద్ద చిప్స్ వేశారు. కాని ఆ చిప్స్‌ను ఇంతవరకూ సరిచేరి తారు వేయలేదు. దీంతో వాహనాలు బోల్తా పడడంతో పాటు ప్రయాణికులు గాయాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హైవే కాలువ ఆక్రమణకు వ్యాపారి యత్నం

- చెరువుగట్టును రోడ్డు చేసేందుకు...
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హైవే అధికారులు



కాలువపై పలకల తొలగించిన వైనాన్ని పరిశీలిస్తున్న హైవే సూపర్ వైజర్ విజయ్‌కుమార్

నరసన్నపేట, ఏప్రిల్ 6: జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో కాలువ పలకలను తొలగించి రోడ్డు నిర్మాణాలకు వ్యాపారులు పాల్పడుతున్నారు. జలగల చెరువు వద్ద గతంలో చెరువు గట్టును చదును చేసి రోడ్డు వేయగా అప్పట్లో రెవెన్యూ అధికారులు తొలగించి హైవే వద్ద ట్రెంచ్ ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల వేళ సదరు వ్యాపారి నేషనల్ హైవే పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన కాలువను ధ్వంసం చేసి పలకలను ఏర్పాటు చేశారు. మారుతీనగర్ వద్ద మరో వ్యాపారి కూడా ఇలాగే కాలువలను పాడు చేశారు. ఇదిలా ఉండగా కాలువ లను కూలదోసి నిర్మాణాలు చేపట్టడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హైవే సూపర్‌వైజర్ విజయ్ కుమార్ తెలిపారు. ఆక్రమార్కులపై శాఖాపరంగానూ చర్యలు తీసుకోవాలన్నారు. అయితే సదురు అక్రమణ దారులకు పంచాయతీ అధికారుల నుంచి మద్దతు ఉండటంతోనే మరలా ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఈవో చిన్నారావు వద్ద ప్రస్తావించగా తామేమీ తప్పు చేయడం లేదని.. పత్రికల్లో రాస్తే రాసుకోవచ్చునని బదులు ఇవ్వడం గమనార్హం.



ఇచ్ఛాపురం: ఓటు హక్కు వినియోగంపై మహిళలకు అవగాహన కలిగిస్తున్న అధికారులు



ఆమదాలవలస: ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఓటుహక్కును వినియోగించుకోవాలి

నందిగాం: మండలంలోని పలు గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై శనివారం ర్యాలీలు, అవగాహనా సదస్సు లు నిర్వహించారు. వెలుగు ఆధ్వర్యంలో నర్సిపురం, రధజన బొడ్డపాడు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఓటర్లకు ఓటు హక్కు అవశ్యకతపై చైతన్యం నింపారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం కె.జాంబవతి కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీవోఏలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

● **ఎచ్చెర్ల:** ఓటు హక్కు వినియోగంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, జిల్లా పర్యాటకాధికారి ఎన్.నారాయణ రావు, డీఎస్‌డీవో కె.శ్రీధర్, సెట్ శ్రీ మేనేజర్ అప్పలనాయుడు ఓటు హక్కు అవసరాన్ని వివరించి ప్రతిజ్ఞ చేయించారు.

● **ఇచ్ఛాపురం:** 18 సంవత్సరాలు నిండిన యువతను ఈనెల 15లోగా కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు. ఇచ్ఛాపురం మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామైక్య అధ్యక్షులు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** మండలంలోని వెదుళ్లవలస, హనుమంతుపురం, జొన్నవలస, చింతలపేటల్లో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. స్వయంశక్తి సంఘాల మహిళలు, ఉపాధి హామీ వేతనదారులు గ్రామాల్లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: ఓటు వినియోగించుకుంటామని చేతి వేలు చూపిస్తున్న వర్సిటీ అధికారులు, విద్యార్థులు



నందిగాం: నర్సిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

మరింత నిఘా పెంచాలి

నరసన్నపేట: గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయిలో నిఘా పెంచాలని ఆర్వో జీవీఎస్ రామ్మోహన్‌రావు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జోనల్, బీఎల్వోలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలను 33 రూట్లు, జోన్‌లుగా విభజించామన్నారు. ఆయా జోనల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపా యాలు, ఆయా గ్రామాల్లో శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. ఓటింగ్ శాతం పెం చేందుకు ప్రజలకు అవగాహన కలిగించాలని బీఎల్వోలకు సూచించారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

పలాస: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్టీ పతాకాన్ని నేతలు ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పి.వైకుంఠరావు, కొర్రాయి బాలకృష్ణ యాదవ్, రామానందస్వామి, ఘని, ఎం.ప్రసాదరావు, యోగేశ్వరరావు, లక్ష్మయ్య, మోహన్‌రాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ పైడయ్య, ఎస్ఐ లక్ష్మి అన్నారు. శనివారం చాకిపల్లి, పాతనౌపడా గ్రామాల్లో స్థానికులతో మాట్లాడారు. ఎన్నికలకు ఇబ్బందులు కలిగించినా, అలాగే రౌడీషీటర్లు పైన కూడా దృష్టి సారిస్తామన్నారు. బెల్టుషాపులు నిర్వాహకులపై చర్యలు తప్పవన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరిం చాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మంత్రి ప్రచారానికి చైర్మన్ గైర్హాజర్

పలాస: పలాస వైసీపీ తరఫున పోటీ చేస్తున్న మంత్రి అప్పలరాజు శనివారం ఎన్నికల ప్రచారం ప్రారం భించగా మునిసి పల్ చైర్మన్ బళ్ల గిరిబాబు గైర్హాజర్ కావడంతో ఆ పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. నెల రోజుల నుంచి పార్టీ కార్య క్రమాలకు హాజరుకాకుండా ఆయన దూరంగా ఉంటున్నారు. పార్టీ లో సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్న మనస్తాపంతో ఆయ న మంత్రి నిర్వహించే ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నట్లు అనుచరులు గుసగుసలాడుకుంటున్నారు.

రూ.లక్షల వ్యయం.. లక్ష్యం దూరం

●నాణ్యతలోపంతో జల్‌జీవన్ పనులు ●పలుచోట్ల పైపులైన్లు లీకులమయం ●ప్రజలకు తప్పనితాగునీటి కష్టాలు


హరిపురం రోడ్డులో పైపులైన్ల లీకుల వల్ల వృథాగా పోతున్న నీరు

ఇచ్ఛాపురం: మండలంలో పలుచోట్ల జల్‌జీవన్ పథకం కింద ఏర్పాటుచేసిన తాగునీటి పథకం పనులు నాసిరకం చేయడంతో మూణ్నాళ్లకే పైపులైన్లు లీకవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ఖర్చుచేసి ప్రజలకు సురక్షిత తాగునీరందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఈ నేపథ్యంలో ప్రసుతం వేసవికాలం కావడంతో ప్రజలకు తాగునీటికి కష్టాలు తప్పడంలేదు. ప్రధానంగా నాసిరకమైన పైపు లైన్లు ఏర్పాటు చేయడం వల్ల ఈపథకం ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే హరిపురం, ఈదుపురం, కొలిగాం, కొఠారి, బూర్జపాడు తదితర గ్రామాల్లో లీకవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈదుపురం, హరిపురం వంటి పెద్ద పంచాయతీలకు ఉద్దానం పథకం నుంచి వెళ్లే నీటిపైపులైన్లు లీకవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. వేసవి ప్రారంభం కావడం, బాహుదానదిలో ఈ ఏడాది ఆశించిన ప్రవాహం లేక భూగర్భజలాలు అడుగంటిపోవడం వెరసి నేలబావులు సైతం ఎండిపోయాయి. దీంతో ఉద్దానం ప్రాజెక్టు ద్వారా సరఫరా చేసే నీటిపైనే ఆధార పడాల్సివస్తోందని పలువురు మహిళలు తెలిపారు. తేలుకుంచి నుంచి హరిపురం వరకు దారి పొడవునా పైపులైన్లకు లీకులు ఏర్పడ్డాయి. దీంతో హరిపురం పంచాయతీలో రెండు వేల మంది తాగునీటికి అగచాట్లు తప్పడంలేదు. ఇక్కడ జల్‌జీవన్ పథకం ఇటీవలే ప్రారంభించారు. ప్రారంభించిన కొద్దిరోజులకే పైపులైన్ల లీకవుతుండడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.పైపులైన్ల పాడైన చోట్ల మరమ్మతులుచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విష్ణుమూర్తిని ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని హరిపురం గ్రామస్థులువాపోతున్నారు. ఈఏడాది ఏప్రిల్‌లో గతంలో ఎన్నడూలేని విధంగా నీటిఎద్దడి నెలకొందని పలువురు చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో అధికారయంత్రాంగం తలమునకలైఉంది. దీంతో తాగునీటి సరఫరాపై దృష్టిపెట్టడంలేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా పైపు లీకులు అవుతున్నట్టు మా దృష్టికి రాలేదని ఎంపీడీవో వైవీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. అయితే ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పైపు లైన్ మరమ్మతులు చేపట్టి, నీరు వృథా కాకుండా ఉండేటట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నరసన్నపేట:మండలంలోని వీఎన్‌పురం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎచ్చెర్ల మండలంలోని తొటపాలెం గ్రామానికి చెందిన మురపాక గౌరమ్మ (80)మృతిచెందింది. మరోఇద్దరు గాయపడ్డారు.ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. తోటపాలెంనుంచి ఆటోలో గౌరమ్మ, ఆమె కుమార్తె బి.రత్నం, ఆటో డ్రైవర్ బలగ మురళి వస్తున్నారు. వీఎన్‌పురం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఆటోసమీపంలో గల కాలువలో బోల్తాపడడంతో గౌరమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. రత్నం,మురళి గాయపడ్డారు. అదేసమయంలో అటువైపు వస్తున్న సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐ అశోక్‌బాబు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

హరిపురం:మందస మండలం చిక్కిడిగాం గ్రామంలో శనివారం కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. బలియాశెట్టి కృష్ణ అసోంలో తన తండ్రితో కలిసి తేయాకు తోటల్లో పనిచేస్తూ జీవనంసాగించాడు. అక్కడే పనిచేస్తున్న సంగీతను (27) ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఐదేళ్ల కిందట ఆమెతోపాటు కలిసి తన స్వగ్రామమైన చిక్కిడాంకు వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. శనివారం జీడితోటలో పనిచేసేందుకు కృష్ణవెళ్లి తిరిగివచ్చే సరికి ఇంట్లో వాంతులు చేసుకుంటున్న భార్యను చూసి.. ప్రశ్నించడంతో కడుపునొప్పి తాళలేక గన్నేరు పప్పుతిన్నానని చెప్పడంతో హుటాహుటిన స్థానికులతో కలిసి హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త కృష్ణ ఫిర్యాదు మేరకు మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు


కారులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆమదాలవలస:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వాహనచోదకులు రవాణాశాఖ అధికారులు, పోలీసులు తెలియజేసిన నిబంధనలు మేరకు అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

శ్రీకూర్మం జంక్షన్‌లో రూ.91 వేలు స్వాధీనం

గార: గార మండలంలోని శ్రీకూర్మం జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీలో భాగంగా ఓ ద్విచక్రవాహనంలో తీసుకువెళ్తున్న రూ.91 వేలు సీజ్ చేసినట్లు తహసీల్దార్ జె.శ్రీను తెలిపారు. కళింగపట్నానికి చెందిన పొట్నూరు సతీష్ తన ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం బగ్గు సత్యనారాయణ ఆధ్వర్యంలో తనిఖీ చేయగా నగదు పట్టుబడింది. ఈ నగదుకు సంబంధించి ఎటువంటి కాగితాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎఫ్ఎస్‌టీ అధికారి ఇచ్చిన వివరాల మేరకు ఈ విషయాన్ని జిల్లా సీజర్ టీమ్‌కు తెలియజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

తగాదాలకు దూరంగా ఉండాలి: సీఐ


మాట్లాడుతున్న దివాకర్ అర్జున్

బూర్జ: అనవసర తగాదాలకు దూరంగా ఉండాలని ఆమదాలవలస సీఐ దివాకర్ అర్జున్‌యాదవ్ కోరారు.శనివారం మండలంలోని ఉప్పినివలస గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికలు గ్రామాల్లో ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు

శ్రీకాకుళం క్రైం: ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకొనేలా చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు తెలిపారు. గురువారం శ్రీకాకుళంనగరంలోని దమ్మలవీధిలో గల పోలింగ్ కేంద్రాలు,ఇన్,ఔట్ దారులను పరిశీలించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు అనవసర ఘర్షణలకు పాల్పడకుండా శాంతిభద్రతకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని కోరారు.కార్యక్రమంలో ఒన్‌టౌన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి


మాట్లాడుతున్న మధుసూదనరావు

జి.సిగడాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు. శనివారం గెడ్డకంచరాంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.ఎన్నికలు దృష్ట్యా గ్రామస్థులు అవాంచనీయ సంఘటనలకు తావివ్వ కుండా చర్యలుతీసుకోవాలని కోరారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

రణస్థలం: నడుకుదిటిపాలేంలో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం శనివారం టీడీపీ,జనసేన, బీజేపీ ఎచ్చెర్ల కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఈసందర్భంగా బీజేపీజెండాను ఆవిష్కరించారు. కార్య క్రమంలో బీజేపీ నేతలు రత్నం, సంపతిరావు నాగేశ్వరరావు, లంక అప్పలనాయుడు పాల్గొన్నారు.● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆశి సత్యం, రామూర్తి పాల్గొన్నారు. ● **జి.సిగడాం:** జి.సిగడాంలో బీజేపీ మండలాధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, పాండూరి అప్పారావు, పొగిరి దాశరథి, శంకరరావు, జి.గౌరినాయుడు పాల్గొన్నారు.

లేఅవుట్లకు అనుమతి తప్పనిసరి: కమిషనర్

ఇచ్ఛాపురం: లేఅవుట్లకు అనుమతి తప్పనిసరి అని ఇచ్ఛాపురం మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో అనుమతిలేకుండా లేఅవుట్లవేసినా, వేయడానికి ప్రయత్నించినా వాటిని తక్షణమే తొలగించకపోతే స్థల యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆక్రమణలు తొలగిస్తే వాటి ఖర్చులు స్థల యజమానులే చెల్లించాలని తెలిపారు. మంగళగిరిలోని డైరెక్టర్ ఆఫ్‌టౌన్ కంట్రీప్లానింగ్ ఆమోదంపొందిన లేఅవుట్లలో మునిసిపాలిటీకి అప్పగించిన రిజర్వ్‌స్థలం ఆ క్రమించేందుకు ప్రయత్నించినా లేదా ఆక్రమించినా పురపాలక సంఘ చట్టం -1965 నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'ఎచ్చెర్ల వైసీపీ అభ్యర్థిని మార్చకపోతే రాజీనామా'

లావేరు: ఎచ్చెర్ల నియోజకవర్గ వైసీపీఅభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్‌ను మార్చకపోతేతామంతా పార్టీకి రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీచేస్తామని పెదలింగాలవలస సర్పంచ్ ప్రతినిధి, వైసీపీనాయకుడు లుకలాపు అప్పలనాయుడు తెలిపారు.శనివారం లింగాలవలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తామంతా వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కు మార్ గెలుపునకు పనిచేశామన్నారు. ఎంతో శ్రమించినా నాలుగేళ్ల నుంచి సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఎచ్చెర్లలో అభ్యర్థిని మార్చకపోతే ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గొర్లె రామినాయుడు, వట్టి సత్యనారాయణ, తేనెల సురేష్ కుమార్, పీరుకట్ల గొల్లారావు పాల్గొన్నారు.

టీడీపీలో 200 కుటుంబాల చేరిక


పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే అశోక్

కవిటి/కంచిలి:కవిటి మండలంలోని బెలగాం పంచాయితీకి చెందిన మాజీ సర్పంచ్ బి.జోగమ్మ, వాసుదేవ్‌తో పాటు బసవకొత్తూరు గ్రామస్థులు,కంచిలి మండలంలోని జాడుపూడి పంచాయతీ బసవపుట్టుగ గ్రామానికి చెందిన 200 కుటుంబాలు టీడీపీలో శనివారం చేరాయి.ఈ మేరకు బసవకొత్తూరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి .మణిచంద్రప్రకాశ్, సంతోష్‌పట్నాయక్, మోహన్‌రావు, పి .కృష్ణారావు, పిలక చిన్నారెడ్డి పాల్గొన్నారు.
●**సోంపేట:** సోంపేటలో ఇచ్ఛాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బెందాళంఅశోక్ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజుతోకలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాక్షస పాలన పోవాలంటే టీడీపీ ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయనవెంట చంద్రమోహన్, చిత్రాడ శ్రీను, చిత్రాడ శేఖర్ ఉన్నారు.

రొట్టవలసలో వంద కుటుంబాలు..


టీడీపీలో చేరిన వారితో రామ్మోహన్‌నాయుడు, రవికుమార్

సరుబుజ్జిలి:రొట్టవలసలో తెలుగుయువత మండలాధ్యక్షుడు తాడేల రాజారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాడేల వెంకట రమణ, నాయకుడు బెవర లక్ష్మణరావు ఆధ్వర్యంలో వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పంచాయతీవార్డుసభ్యుడు గుజ్జల సింహాచలం, అక్కివరపు రాంబాబు, సువరపు రామారావు, వైసీపీ నాయకులు తొత్తడి వైకుంఠరావు, ధనుకోటి తవిటినాయుడు, వెంకటరమణ, దాలినాయడు, రమణమూర్తి, అప్పలనాయుడు తదితరులకు టీడీపీ ఎంపీ అభ్యర్థి కింజరాపురామ్మోహన్‌నాయుడుతోపాటు పార్టీజిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కండువాలువేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, కిల్లి సిద్దార్థ, పల్లి సురేష్, ఈశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, రాము పాల్గొన్నారు.

ప్రజల ఆస్తుల తాకట్టుకు జగన్ సిద్ధం: కూన

సరుబుజ్జిలి:రాష్ట్రంలో ఐదేళ్ల చేతకానిపాలనతో ప్రభుత్వ ఆస్తులన్నీ తనఖా పెట్టిన సైకో సీఎం జగన్‌రెడ్డి, మళ్లీ వస్తే ప్రజల ఆస్తులన్నీ తనఖా పెట్టడానికి సిద్ధంగా ఉన్నాడని టీడీపీ జిల్లాఅధ్యక్షుడు కూనరవికుమార్ ఆరోపించారు. ఇసుకలపాలెం, సుబ్బపేట, పెద్దవెంకటాపురంలో టీడీపీ నాయకుడు పల్లిసురేష్ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవతలహబాద్ చెరువు వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన కన్వీనర్లు పి.సూరపునాయుడు, పి.రామ్మోహన్, నాయకులు శివ్వాల సూర్యనారాయణ, రాంబాబు, సిద్దార్థ, టి.సురేంద్ర, ఈశ్వరరావు పాల్గొన్నారు.
●**బూర్జ:** కురిమిపేట గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ ఆహ్వానించారు. వైసీపీ నాయకులు గుండు సతీష, దుర్గా ప్రసాద్, గణపతి, రమేష్, జనార్దన్, హరి, దుర్గారావు, తులసి, సాయిరాం, తదితరులు చేరారు.

వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకం కాదు

● ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం

అరసవల్లి:వలంటీర్ల వ్యవస్థను దుర్వినియోగం చేసుకుని వైసీపీ ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం ఆరోపించారు. వలంటీర్ల వ్యవస్థకు తమ పార్టీ వ్యతిరేకం కాదని చెప్పారు. శనివారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఎన్నికల పనులకు వలంటీర్లను వాడుకుని బలిపశువులను చేస్తున్నారన్నారు. ఈసీ నియమావళిప్రకారం ప్రభుత్వోద్యోగులే పింఛన్లు పంపిణీచేయాలని కోరారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, బొనిగి భాస్కరరావు పాల్గొన్నారు.

దమ్ముంటే ప్రజాక్షేత్రంలోకి రా..ధర్మానా: శంకర్


సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి గొండు శంకర్ ఆరోపించారు. దమ్ముంటే ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం....రా...ధర్మానా అని సవాల్ విసిరారు. శనివారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డు నుంచి గార, శ్రీకాకుళం రూరల్, నగరంలోని పార్టీ కార్యకర్తలు, అభిమానులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో శంకర్ మాట్లాడారు. తనకు ఎవరితోను శతృత్వం లేదని, గుండ దంపతులు తనకు తల్లిదండ్రులతో సమానమని, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటానని తెలిపారు.కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, జనసేన ఇన్‌చార్జి కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు పూడి తిరుపతిరావు, చల్లాఉమామహేశ్వరరావు, శవ్వాన ఉమామహేశ్వరి, టీడీపీ నాయకులు పాండ్రంకి శంకర్, బొనిగి భాస్కరరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరగోపాల్, ఇప్పిలి తిరుమలరావు పాల్గొన్నారు. కాగా హయాతినగరంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోళ్ల నాగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు.

సైకో జగన్‌ను గద్దె దించండి: ఎన్ఈఆర్


సుభద్రాపురంలో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

లావేరు : సైకోజగన్‌ను గద్దెదించాలని ఎచ్చెర్ల ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సుభద్రాపురం, గురుగుబిల్లి, లావేరు, చిగిరికొత్తపల్లిల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు పోటీచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పిడి సురేష్, ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు, జనసేన నాయకులు బి.దుర్గారావు, టీడీపీ నాయకులు బాడిత లక్ష్మణరావు, చిట్టిబాబు, ఐ.తోటయ్యదొర, ఎల్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చంద్రబాబుపై నమ్మకముంది

టీడీపీ నాయకుడు అప్పల సూర్యనారాయణ


మాట్లాడుతున్న గుండ అప్పలసూర్యనారాయణ

అరసవల్లి: నియోజకవర్గంలో పార్టీకోసం ఐదేళ్లుగా పనిచేశామని, క్రమశిక్షణకు భంగం కలిగించే విధంగా జరిగిన సంఘటనలను చంద్రబాబుకు వివరించామని, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా నష్ట నివారణ చంద్రబాబు చర్యలు తీసుకుంటారన్న నమ్మకం ఉందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పల సూర్యనారాయణ తెలిపారు. శనివారం అరసవల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా గుండ లక్ష్మీదేవి ఐదేళ్లుగా అన్ని కార్యక్రమాలను నిర్వహించారని చెప్పారు. యువతకు టిక్కెట్ ఇవ్వాలన్న నినాదంతో అసమ్మతికి తెరతీసిన వ్యక్తికి ఇవ్వడం బాధ కలిగించిందన్నారు.

'సూపర్‌సిక్స్'పై అవగాహన

కంచిలి:తలతంపరలో సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలతో టీడీపీ మండలఅధ్యక్ష కార్యదర్శులు బంగారు కురయ్య, మాదిన రామారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మర్రిపాటి పూర్ణణ, టీవీ రమణ, దుర్గా శ్రీనువాస్, రమేష్, మద్దిల భాస్కరరావు పాల్గొన్నారు.
●**ఇచ్ఛాపురం:**ఇచ్ఛాపురంమునిసిపాలిటీలోని పురుషోత్తపురం పరిధిలో గల వార్డుల్లో టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని ఇంటింటా ఎన్నికల ప్రచారంచేశారు.ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీయాదవ్, కొండా శంకర రెడ్డి, కౌన్సిలర్లు పత్రి తవిటయ్యయాదవ్, కాళ్లదిలీప్, కాళ్ల జయదేవ్, లీలారాణి, నాగరాజు, రెయ్యి జానికిరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని శాసిస్తున్న సెమీకండక్టర్ రంగం



మాట్లాడుతున్న దిలీప్

ఎచ్చెర్ల: సెమీ కండక్టర్ రంగం ఆధునికతను సంతరించుకుని కొత్త పుంతలు తొక్కుతోందని క్యాస్ట్ గ్లోబల్ సంస్థ టెక్నికల్ మేనేజర్ వై.దిలీప్ తెలిపారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. మెమోరీ చిప్ తయారీ, మైక్రో ప్రాసెసర్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ తదితర ప్రయోజనాలతో సెమీకండక్టర్ రంగం నేడు ప్రపంచాన్ని శాసిస్తోందని చెప్పారు. కంప్యూటర్ మొబైల్, హార్డ్‌వేర్, మెడికల్ తదితర రంగాల పరిశోధనలకు ఈ పరిశ్రమ ఎంతో బాసటగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. సుజాత, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయబాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు, ఈసీఈవిభాగ సమన్వయకర్త హరిత పాల్గొన్నారు.

బాహుదాతీరంలో బుడ్డుయాత్ర

ఇచ్ఛాపురం: బాహుదానదీ తీరంలోని వెలసిన పాతాళ సిద్దేశ్వరాలయంలో బుడ్డుయాత్ర పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం వేకువ జాము నుంచే భక్తులు, మహిళలు బాహుదా నదిలో స్నానాలు ఆచరించి బిందెలతో తీసుకొచ్చిన జలాలతో శివునికి, శివలింగానికి అభిషేకాలు చేశారు. 35వ బుడ్డుయాత్ర (మహాతీర్థస్నా యాత్ర) పురస్కరించుకుని అఖండదీపారాధన, గంగా భవాని కుంకుమ పూజలు, పంచామృత జలాభిషేకాలు, హరినామ సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయప్రాంగణంలో అన్నదానకార్యక్రమం ఏర్పాటుచేశారు.

తోణంగిలో ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గార:మండలంలోని తోణంగి, చిన్నతోణంగిల్లో ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గార ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించినకార్యక్రమంలో కేంద్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.

శ్రీరామరాజ్యంపై బుర్రకథ

శ్రీకాకుళంకల్చరల్:స్థానిక బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో 294వ నెల సాంస్కృతిక కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సింహాద్రినాయుడు ట్రూప్ ద్వారా మల్లిఖార్జున బృందం శ్రీరామరాజ్యంపై బుర్రకథ ప్రదర్శించింది. అనంతరం పేద కళాకారులకు ఫించన్లు అందజేశారు.కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, చిట్టి వెంకటరావు, బెహరా గణేష్, పేడాడధనుంజయ్‌రావు, దుంగా సుధాకరరావు, కన్నాల నరసింహమూర్తి, రామచంద్ర దేవ్ పాల్గొన్నారు.

సర్వేనెంబర్లు కనిపించక.. రిజిస్ట్రేషన్లు కాక

● ఆందోళన చెందుతున్న క్రయ విక్రయదారులు
● ఇదీ సోంపేట రెవెన్యూలో వ్యవసాయేతర భూముల పరిస్థితి

సోంపేట: స్టాంపులు రిజిస్ట్రేషన్ల అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని సోంపేట రెవెన్యూపరిధిలోని వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు అర్థాంతరంగా నిలిచిపోవడంతో క్రయవిక్రయదారులు ఆందోళన చెందుతున్నారు. జలంత్రసోంపేట, బిరుసువడ, చీకటిసోంపేట, మొగలికొత్తూరు పరిధలో ఉన్న సర్వేనెంబర్లు రిజిస్ట్రేషన్ సైట్‌లో కనిపించడంలేదు. దీంతో రిజిస్ట్రేషన్లు చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ ముందుకు రావడంలేదు. సోంపేట రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూముల్లో అయితే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా, గజాల్లో ఉండే వ్యవసాయేతర భూముల విషయంలో మాత్రం ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా పడిపోయిన విషయం విదితమే. దీనికితోడు ఇటీవల సోంపేట రెవెన్యూ పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో క్రయ, విక్రయదారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో ఇప్పటికే పది డాక్యుమెంట్లు సోంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ డాక్యుమెంట్ల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో సబ్‌రిజిస్ట్రార్‌కు దిక్కుతోచడంలేదు. కాగా సోంపేట రెవెన్యూ పరిధిలో వ్యవసాయేతర భూములు రిజిస్ట్రేషన్ సైట్‌లో కనిపించడంలేదని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఎం.రాఘవులు తెలిపారు. కేవలం వ్యవయాసయ భూములు మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తున్నామనిచెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి దీనిని సరిచేస్తేనే రిజిస్ట్రేషన్ల విషయంలో ముందుకు వెళ్లగలమని తెలిపారు.

నేడు శ్రీవిశ్వవిజేతలో ఉద్యోగ మేళా

అరసవల్లి: పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాల మధ్యవయస్సు యువకులు శ్రీకాకుళంలో గల శ్రీవిశ్వవిజేత జూనియర్ కాలేజీలో ఆదివారం నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కాలేజీ మేనేజ్‌మెంట్ వర్గాలు ఒకప్రకటనలో తెలిపాయి. వివరాలకు 8688336652, 9492259132, 7997228649నెంబర్లను సంప్రదించాలని కోరాయి.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ గగనకుమారి తెలిపారు. శనివారం ఇచ్ఛాపురంలో నేషనల్ గ్రీన్ క్రాప్స్‌ఎన్విరాన్‌మెంట్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ టీచర్స్ ఆర్.వల్లబరావు, ఎం.ఈశ్వరి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాగునీటి సమస్యపై చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రసాదరావు

ఇచ్ఛాపురం: 15వ ఆర్థిక సంఘ నిధులు అందుబాటులో ఉన్నాయని, తాగునీటి సమస్యల లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రసాదరావు అధికారులకు సూచించారు. శనివారం మండల సాధా రణ సర్వ సభ్య సమావేశం ఎన్నికల కోడ్ వల్ల వాయిదాపడింది. అనంతరం అధికారులతో ఎంపీడీవో సమీక్షించారు. తాగునీటి సమస్యపై ప్రత్యేకదృష్టి సారించాలని కోరారు. పంచాయతీల్లో బోర్లు,పైపులైన్లు పాడైతే తక్షణమే మరమ్మతులు చేయాలని తెలిపారు. మెటీరియల్స్ కొనుగోలు చేయడానికి నిధులు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడుకు పరామర్శ


అచ్చెన్నను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

పొందూరు: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడుకు శనివారం మండలంలోని టీడీపీ నాయకులు నిమ్మాడలో పరామర్శించారు. ఇటీవల అచ్చె న్నాయుడు తల్లి కళావతమ్మ మృతిచెందిన విషయం విదితమే. ఈ మేరకు టీడీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం ప్రధానకార్యదర్శి సీపాన శ్రీరంగ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బాడాన గిరి, నాయకులు సీపాన భాస్కరరావు, వరదరాజులు పరామర్శించారు.

నందీశ్వరునికి కర్పూర హారతి


నందీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని గుడివీధి సమీపంలో నాగావళి నదీ తీరంలో వెలసిన ఉమారుద్రకోటేశ్వరాలయంలో శనివారం సాయంత్రం త్రయోదశి పురస్కరించుకుని ప్రదోషకాలంలో నందీశ్వరునికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి శర్మ పర్యవేక్షణలో అర్చకులు ఆరవెల్లి చంద్రశేఖర్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మంగళవాయిద్యాలు వేదమంత్రోర్చణల నడుమ ఈశ్వరునికి రుద్రాభిషేకంచేశారు. అనంతరం కోటేశ్వరస్వామి, అమ్మవారికి, నందీశ్వరునికి కర్పూరహారతి ఇచ్చారు. నందీశ్వరునికి ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుకన్య పాల్గొన్నారు.